క్లుప్తంగా

పురంలో ఫ్లెక్సీల రాజకీయం



మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఫోటో లేకుండా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

పార్వతీపురంటౌన్: పట్టణంలో టీడీపీ ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి సంధ్యారాణి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ వర్గీయులు వేరువేరుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వర్గీయుల ఫ్లెక్సీల్లో ద్వారపురెడ్డి ఫోటోలు కనిపించలేదు. దీంతో ఇరువురి మధ్య నడుస్తున్న కోల్డ్ వార్ బహిర్గతమైంది.

చురుగ్గా పింఛన్ల వెరిఫికేషన్



లబ్ధిదారుల అర్హతలు పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: సామాజిక భద్రత పింఛన్ల వెరిఫికేషన్ చురుగ్గా జరుగుతోంది. మండలంలోని లచ్చయ్యపేటలో సోమవారం పింఛన్ వెరిఫికేషన్ జిల్లా ప్రత్యేకాధికారి, డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌డీఓ) ఎస్.రమేష్ రామన్ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ లబ్ధిదారుల అర్హతలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌ఓ మాట్లాడుతూ.. కొంత మంది తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతుండటంతో అర్హులు పింఛన్లు పొందలేక నష్టపోతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పింఛన్ల పరిశీలన చేపడుతోందన్నారు. గ్రామంలో 394 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. వారందరి అర్హతలను పరిశీస్తున్నామన్నారు. పింఛన్ల తొలగింపునకు సర్వే చేస్తున్నట్లు కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని, అర్హుల పింఛన్లు ఎట్టిపరిస్థితిలోనూ తొలగించడం జరగదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.త్రివిక్రమారావు, వివిధ మండలాలలకు చెందిన ఇంజినీరింగ్, విద్యాశాఖ, వెలుగు, ఉపాధిహామీ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు తప్పవు

- ఎస్‌డీసీ ధర్మచంద్రారెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి

పార్వతీపురంటౌన్: వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యతను పిల్లలే తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రా రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో గిరిజనాభివృద్ధి సహాయ ప్రాజెక్టు అధికారి మురళీధరన్, కలెక్టరేట్ ఎఫ్–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీరామ్మూర్తితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచి ఉద్యోగం వచ్చేవరకు పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పోషించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను విస్మరించిన వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని స్పష్టంచేశారు. ప్రతీ వారం పబ్లిక్ గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పబ్లిక్ గ్రీవెన్స్‌కు 115 అర్జీలు అందినట్లు చెప్పారు.

బ్యాంకు వివరాలు చెప్పొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలకంఠారావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు చెప్పవద్దని నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా కురుపాం మండలంలోని నీలకంఠాపురం వారపుసంత వద్ద ప్రజలకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, రోడ్డు భద్రతా నియమాలు, బాల్యవివాహాల నిర్మూలన వంటి వాటిపై సోమవారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులపై క్లిక్ చేయొద్దని, వాటిని క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్లు మన సొమ్మును దోచేస్తారని ఆయన తెలిపారు. అలాగే గంజాయి, కొకై న్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, మద్యం, ధూమపానం వంటివి చేయొద్దన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు.

అభివృద్ధి పనులు ▶ మరింత ఆలస్యం

- 'పల్లెపండగ' పేరుతో అక్టోబర్‌లో హడావిడి
- మూడు నెలలు అయినా ముందుకు సాగని పనులు
- క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యమే కారణం
- జిల్లాలో రూ.116 కోట్లతో 367 పనుల మంజూరు

పార్వతీపురంటౌన్/బలిజిపేట:

'పల్లెపండుగ'పై అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఉపాధిహామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అక్టోబర్ 14న 'పల్లె పండుగ' పేరుతో గ్రామాల్లో హడావుడి చేసింది. గత ప్రభుత్వంలో గుర్తించిన పలు అభివృద్ధి పనులనే గ్రామసభల్లో మరోసారి తీర్మానాలు చేసి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపనలు చేశారు. వాటిని సంక్రాంతి నాటికి పూర్తిచేయాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. కొన్నిచోట్ల నెమ్మదిగా జరుగుతుంటే.. మరికొన్ని చోట్ల అసలు పనులు ప్రారంభమే కాలేదు. 'పల్లెపండుగ' పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని జిల్లాస్థాయి అధికారులు ఆదేశించారు. అయితే పనుల నిర్వహణకు పలు సమస్యలు అడ్డంకిగా మారాయని స్థానిక అధికారులు అంటున్నారు. ముఖ్యంగా ఇసుక కొరతతో పనులు నిలిచిపోయాయి. ఇసుక కోసం ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ నుంచి ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇంతవరకు ఎవరు ఏ ర్యాంపు నుంచి ఇసుక తెచ్చుకోవాలనే దానిపై స్పష్టత లేదు. నామినేషన్ పద్ధతిలో పార్టీ కార్యకర్తలకే పనులు కేటాయించడంతో కొందరు ముందుగా పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా లేకపోవడంతో పలుచోట్ల పనులు ప్రారంభం కాలేదు.



బలిజిపేట మండలం చిలకలపల్లిలో రెండు నెలల కిందట ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ చేసిన స్థలం

శంకుస్థాపనలకే పరిమితం

బలిజిపేట మండలంలోని 24 పంచాయతీల్లో సుమారు రూ.2.05 కోట్లతో సీసీ రోడ్లు, వీధికాలువల నిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేశారు. ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. ఉపాధి హామీ నిధులతో చేపట్టే ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు టెంకాయలు కొట్టేసి వదిలేశారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తిచేస్తామని కూటమి నాయకులు గొప్పలు చెప్పారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి మాత్రం శూన్యమనే చెప్పాలి. అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అనుమతులు పూర్తయినా వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకపోవడంతో పనుల్లో తత్సారం జరుగుతోంది. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ అంబేడ్కర్ వివరణ కోరగా.. పీఆర్ శాఖ ద్వారా ప్రతిపాదించిన పనులుక అడ్మినేస్ట్రేషన్, టెక్నికల్ అనుమతులు పూర్తయ్యాయని, వారం రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.



బలిజిపేట వెలుగు కార్యాలయం పక్కన తీసిన ఇంకుడుగుంత పరిస్థితి

జిల్లాకు 367 పనులు..

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జిల్లాకు మొత్తం 367 పనులు మంజూరయ్యాయి. ఇందుకు గాను రూ.116 కోట్లు మంజూరు చేశారు. కానీ సాంకేతిక కారణాలతో పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. వాటిని పర్యవేక్షించేవారు కూడా లేకపోవడంతో క్షేత్రస్థాయి అధికారులు, కాంట్రాక్టర్లలో నిర్లక్ష్యం నెలకొంది.

నామినేషన్ పద్ధతిలో కార్యకర్తలకే కాంట్రాక్టులు

గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ముందుగా సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నారు. ఒక్కో కిలోమీటరుకు రూ.50 లక్షల వరకు అంచనా వేశారు. ఉపాధిహామీ పథకం నిబంధనల ప్రకారం 125 అడుగుల రోడ్డు నిర్మించాలి. ఇంకా 1 నుంచి 3 శాతం వరకు ప్రజా ప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు నిర్మించవచ్చు. 7 నుంచి 8 అంగుళాల మందం ఉండేలా చూడాలి. కానీ ఈ పనులన్నీ నామినేషన్ పద్ధతిలో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతలే చేస్తున్నట్లు సమాచారం. కార్యకర్తల పేర్లతో కాంట్రాక్టర్లు కూడా పనులు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ సీసీరోడ్లు నిర్మిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో 30 వర్కులు శాంక్షన్ అయ్యాయి. పనుల నిర్మాణం మొదలైనట్లు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. కానీ చాలా పనులు మొదలు కాలేదు. కొన్నింటికి శంకుస్థాపన చేయలేదు. కొన్ని పనులకు సంబంధించి రోడ్లను శుభ్రం చేశారు. కొంత మట్టి పోశారు. కొన్నిచోట్ల ఆల్టర్నేట్ రోడ్లను ప్రతిపాదించారు.



బలిజిపేట మండలం పి.చాకరాపల్లిలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన రోడ్డు

వలంటీర్లకు ఇచ్చిన హామీ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్

పార్వతీపురంటౌన్: వలంటీర్ వ్యవస్థ పట్ల ప్రస్తుత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజలకు సేవలందించేద ని అన్నారు. ఎన్నికల సమయంలో వలంటీర్ల ఓట్ల కోసం తాము అధికారంలోకి వస్తే రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం వలంటీర్ల కు ఇచ్చిన హామీని అమలు చేయాలని, వలంటీర్ల ను వెంటనే విధుల్లోకి తీసుకుని వారికి నెలకు రూ.10 వేలు గౌరవ వేతనంతో పాటు ఆరె నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ల జిల్లా అధ్యక్షుడిగా పి.కుమార్

అనంతరం వలంటీర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఆర్వీఎస్ కుమార్, అధ్యక్షుడిగా పి.కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రావణి, ఆశ, జిల్లా కార్యదర్శిగా ఆర్.సురేంద్ర, జాయింట్ సెక్రటరీలుగా భారతి, క్రాంతి, కోశాధికారిగా జి.రాంబాబు, ఈసీ సభ్యులుగా సౌజి, ఎస్.క్రాంతి, టి.దుర్గా, కె.రజనీలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, ఉప కార్యదర్శి బలగ రాధ, రాష్ట్ర వలంటీర్ల కార్యవర్గ సభ్యులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- అన్నదాతకు పెట్టుబడిసాయం తక్షణమే అందించాలి
- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: అన్నదాతకు ఇస్తామన్న పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల గడుస్తున్నప్పటికీ ఇంతరకు రైతన్నలకు ఇస్తామన్న పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులకు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, వారి తరఫున పోరాడేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా రైతు సమస్యలపై పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో వందలాది మంది రైతన్నలతో కలిసి కలెక్టర్ కార్యాలయం వదరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్‌వీఎస్ కుమార్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: అవుట్ సోరింగ్ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా ఆస్పత్రి వద్ద సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19న విజయవాడలో నిర్వహించనున్న 6వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర అలవెన్స్‌లు, సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా ఈ మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, చంద్రమౌళి, జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నిరసన తెలియజేస్తున్న మహిళలు

సీతానగరం: తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట అప్పయ్యపేట ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. పెదభోగిలి పంచాయతీ మధుర గ్రామమైన అప్పయ్యపేటలో జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినప్పటికీ తాగునీరు సరఫరా చేయకపోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీటి కష్టాలు తొలగిపోయాయని ఎంతో సంబరపడ్డామని, కానీ అవి మూనాళ్ల ముచ్చటగానే మారాయని వాపోయారు. తాగునీటి సమస్యలపై పంచాయతీ పెద్దలకు, మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారమయ్యేంత వరకు అక్కడ నుంచి కదిలేది లేదంటూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు వారికి సంఘీభావం తెలియజేశారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు అక్కడకు చేరుకుని కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు.

రెగ్యులర్ డీడీని నియమించాలి



మాట్లాడుతున్న గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు మంచాల ఈశ్వరరావు

పార్వతీపురంటౌన్: ఐటీడీఏకు రెగ్యులర్ డీడీని నియమించాలి గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు మంచాల ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పనిచేసిన రెగ్యులర్ డీడీ బదిలీ కావడంతో సాంఘిక సంక్షేమశాఖ డీడీకి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారన్నారు. దీనివల్ల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడటంతో పాటు ఆఫీసులో పెండింగ్ ఫైళ్లు పెరిగిపోతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఐటీడీఏకు రెగ్యులర్ గిరిజన సంక్షేమ సాధికారత అధికారిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్లా సురేష్, ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు సరికాదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు అలజంగి జోగారావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. వీరఘట్టం మండలం దశుమంతుపురం గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ అలజంగి యగ్నేష్‌పై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యల కు వడిగడుతూ ఇటీవల సీఐడీ అధికారులచే అకారణంగా అరెస్టు చేయించిందన్నారు. బాధితుడి తరఫున వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచి, లీగల్ టీమ్‌ను పంపించి బెయిల్ మంజూరు చేయించారన్నారు. బాధితుడిని గుంటూరు జిల్లా నుంచి మన్యం జిల్లాకు తీసుకొచ్చి అతని తల్లిదండ్రులకు అప్పగించడంతో పాటు వారికి అండగా నిలిచారన్నారు. అలజంగి యగ్నేష్ సోమవారం అలజంగి జోగారావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా యగ్నేష్‌ను ఆయన సత్కరించి అభినందించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌పైన ఉన్న అభిమానంతో అతనికి మద్దతుగా నిలిచాడన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం అకారణంగా యగ్నేష్‌ను అరెస్టు చేసిందని, కూటమి కక్షసాధింపునకు ఇదో నిదర్శనమని అన్నారు. వారి వేధింపులను ఎదురించి నిలిచిన యగ్నేష్‌కి తామంతా అండగా ఉన్నామని మాజీ ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



ఏఎస్పీ అంకిత సురానకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్

పార్వతీపురంటౌన్: భాస్కర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఏఎస్పీ అంకిత సురానను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బాలగడబ సమీపంలో బస్సు బోల్తా పడిన ఘటనలో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, కొంతమంది విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. విద్యార్థులు నెమ్మదిగా వెళ్లమని చెప్పినా డ్రైవర్ మద్యం మత్తులో వారి మాటలు పట్టించుకోకుండా బస్సు నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అనేక విద్యాసంస్థలు నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడుపుతున్నాయని, వాటిపై నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భీమరాజు, సహాయ కార్యదర్శి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

సీతానగరం: ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరు చేసిన గ్రామాభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి గంట చంద్రమౌళీ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న పనులకు అవసరమైన స్థలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో 67 అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం ఉపాధిహామీ పథకం నిధులు రూ.2.52 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. లచ్చయ్యపేట, కె.ఎస్.పురం, అంటిపేట, గుమ్మిడివరం, పెదభోగిలి గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు. నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు పూర్తిచేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

సామర్థ్యాల మదింపునకు 'సాంప్'

- 11 నుంచి 19 వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు
- విద్యాశాఖ పక్కా ఏర్పాట్లు



తరగతి గదిలో చదువుతున్న విద్యార్థులు

బలిజిపేట: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపునకు విద్యాశాఖ ఏటా వివిధ పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రతీ విద్యా సంవత్సరంలో నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలుగా పేరు మార్చారు. ఇప్పటికే రెండు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించగా.. ఐదు నెలలకు ఒకసారి నిర్వహించే సమ్మేటివ్–1 పరీక్షలు అక్టోబర్ నెలాఖరులో లేదా నవంబర్ మొదటి వారంలో నిర్వహించాలి. ఇప్పటికే దాదాపు సగం విద్యా సంవత్సరం పూర్తయింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు సమ్మేటివ్–1 పరీక్షలు నిర్వహించలేదు. ఈనెల 11 నుంచి 19వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ షెడ్యూల్ విడుదల చేసింది.

సాంప్‌గా పేరు మార్పు

ఇప్పటివరకు ఐదు నెలలకు ఒకసారి నిర్వహించే పరీక్షలను సమ్మేటివ్–1, 2 పరీక్షలుగా పిలిచేవారు. ప్రస్తుతం వీటిని సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపరు(ఎస్ఏఎంపీ)గా మార్పుచేశారు. ఇప్పటికే ఫార్మేటివ్ పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలుగా మార్చారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలతో పాటు, అన్ని ప్రైవేటు యాజమాన్యాలు తప్పనిసరిగా సమ్మేటివ్–1 పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ప్రైవేటు విద్యా సంస్థలు ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా సరఫరా అయ్యే పరీక్ష పత్రాలనే వాడాలని లేదు. ఇది వారి ఇచ్ఛికానికి వదిలేశారు. పరీక్షలకు సంబంధించి విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై జిల్లాకు ఒక క్యూఆర్ కోడ్‌ను కేటాయించారు. పరీక్ష పేపరును ఎవరు లీక్‌చేసినా తెలిసిపోతుంది.

రెండు ఫార్మేటివ్ పరీక్షలు పూర్తి

ఇప్పటికే ఫార్మేటివ్ అసెస్‌మెంట్–1, 2 పరీక్షలు పూర్తయ్యాయి. ఆగస్టులో సెల్ఫ్ అసెస్‌మెంట్–1, అక్టోబర్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు నిర్వహించారు. వాటిని మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జనవరిలో ఫార్మేటివ్–3, మార్చిలో ఫార్మేటివ్–4, ఏప్రిల్‌లో 1–9 తరగతులకు సమ్మేటివ్–2 పరీక్షలు నిర్వహించనున్నారు.

గంట ముందే ప్రశ్నపత్రాలు

ఎమ్మార్సీ, స్కూల్ కాంప్లెక్సలలో పరీక్షకు గంట ముందు ప్రశ్నపత్రాలను ఇస్తుండడంతో వాటిని పాఠశాలలకు చేరవేసేందుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు స్కూల్ కాంప్లెక్సల నుంచి, ఉన్నత పాఠశాలలకు చెందిన పేపర్లు ఎమ్మార్సీ నుంచి తీసుకువెళ్లాలి.

కట్టుదిట్టంగా నిర్వహణ



సాంప్ పరీక్షలను ప్రభుత్వం కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించింది. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. దీనివలన విద్యార్థుల సామర్థ్యాలు పక్కాగా తెలిసే అవకాశాలున్నాయి. అందరూ వీటిని ఖచితంగా అమలు చేయాలి. – సామల సింహాచలం, ఎంఈఓ, బలిజిపేట